క్లుప్తంగా

నిషేధిత ప్రాంతాల్లో వాహనాలు పార్క్ చేస్తే సీజ్



వాహనాన్ని తరలిస్తున్న ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్, ఎస్‌ఐ రమేష్

సింహాచలం: నిషేధిత ప్రాంతాల్లో వాహనాలు పార్క్ చేస్తే సీజ్ చేస్తామని పెందుర్తి ట్రాఫిక్ ఎస్‌ఐ రమేష్ తెలిపారు. పెందుర్తి బీఆర్‌టీఎస్ రోడ్డులోని పలు ప్రాంతాల్లో ఇష్టానుసారం పార్క్ చేసిన కార్లను సోమవారం సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రమేష్ మాట్లాడుతూ వాహనాలను రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయన్నారు. నిషేధిత ప్రాంతాల్లో వాహనాలు పార్క్ చేయడం సరికాదన్నారు. అలా పార్క్ చేసిన వాహనాలను కోర్టుకుకి తరలించి అపరాధ రుసుం విధింపజేస్తామని తెలిపారు.

ఘనంగా రాజారామ్మోహన్ రాయ్ జయంతి



రాజారామ్మోహన్‌రాయ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బాలలు

పరవాడ: అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం ఆధ్వర్యంలో రాజారామ్మో హన్‌రాయ్ జయంతిని సోమవారం పరవాడలో ఘనంగా నిర్వహించారు. అనకాపల్లి జిల్లా ఐద్వా అధ్యక్షురాలు పి.మాణిక్యం బాలలతో కలిసి మోహన్‌రాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజేష్, ఎం.మూర్తి, జానకిపాల్గొన్నారు.

పరమేశ్వరుడికి విశేష అభిషేకాలు



ఉమాచంద్రమౌళీశ్వర స్వామి

సింహాచలం: అడవివరం విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు తరలివచ్చి స్వామిని బిల్వపత్రాలతో పూజించారు. మహిళలు ఉమాదేవి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. పలురకాల పుష్పాలతో స్వామిని విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

గురుకుల పాఠశాలల్లో ఇద్దరికి సీట్లు





కట్టా లాశ్యశ్రీ, గుణశ్రీ

పరవాడ: మండలంలో భర్నికం శివారు బాపడుపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు సబ్బవరం, తాళ్లపాలెం గురుకుల పాఠశాలల కు ఎంపిక య్యారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి.రాజశ్రీ చెప్పారు. పాఠశాలకు చెందిన కట్టా లాశ్యశ్రీ, సమ్మెంగ గుణశ్రీలు ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబర్చి సబ్బవరం, తాళ్లపాలెం ప్రాంతాల్లోని గురుకుల పాఠశాలల్లో సీట్లు సాధించారని తెలిపారు. ఉపాధ్యాయుడు కొరుపోలు గంగాధర్ విద్యార్థులను ప్రోత్సహించారని చెప్పారు. గురుకుల పాఠశాలల్లో సీట్లు సాధించిన విద్యార్థులను సోమవారం పాఠశాల హెచ్‌ఎం రాజశ్రీ, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



అసకపల్లిలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడంతో పాటు అర్హులైనవారందరికీ సంక్షేమ పథకాలు అందించే ధ్యేయంతో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ చెప్పారు. జీవీఎంసీ 97వవార్డు 494 సచివాలయం పరిధిలోని శ్రీనివాసనగర్‌లో సోమవారం ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే ఏవిధంగా అందించాలో సచివాలయ సిబ్బందికి సూచించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో 97వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మెంటి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు

సబ్బవరం: ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మండలంలోని అసకపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. లబ్ధిదారులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత గ్రామాల్లో కల్పిస్తున్న వసతులను, పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే అదీప్‌రాజ్ వివరించారు. రైతు భరోసా, అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, జగన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన వంటి అనేక సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం ప్రతి ఇంటికీ లక్షలాది రూపాయలు అందిస్తుందన్నారు. గ్రామాల్లో అన్ని రకాల వసతులను దశలవారీగా కల్పిస్తామని చెప్పారు.

అభివృద్ధి పనులకు నిధులు

గ్రామంలో సీసీ రోడ్లు, ప్రభుత్వ భవనాల వంటి పలు రకాల అభివృద్ధి పనులకు రూ.1.67 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తెలిపారు. ఇప్పటికే రూ.55 లక్షలతో పలు అభివృద్ధి పనులు పూర్తి చేయగా.. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కొటాన రాము, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు, ఎంపీటీసీ కర్రి అప్పారావు, ఎంపీడీవో రమేష్ నాయుడు, పంచాయతీ రాజ్ డీఈ సత్యనారాయణమూర్తి, మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, ఏఈలు శేఖర్, రామలక్ష్మణ, మాజీ సర్పంచ్ కాపుశెట్టి దేముడమ్మ, పార్టీ అధికార ప్రతినిధి వనం అచ్చెంనాయుడు, ఐడీబాబు, సచివాలయ కన్వీనర్ కాపుశెట్టి నీలమణి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఈ-బుకింగ్ సేవలకు ఎదురుచూపులు

- కోవిడ్ కారణంగా మూతపడిన ఎంవీపీ ఈ-దర్శన కౌంటర్
- రెండున్నరేళ్లుగా తెరుచుకోని వైనం



టీటీడీ దర్శన టికెట్ల కోసం ఎంవీపీ కాలనీలోని సెంటర్ ఎదుట బారులు తీరిన భక్తులు (ఫైల్)

ఎంవీపీ కాలనీ: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వెళ్లే భక్తులకు అవస్థలు తప్పడం లేదు. కోవిడ్ కారణంగా మూతపడిన ఎంవీపీ కాలనీలోని ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ సెంటర్ పునః ప్రారంభం కోసం ఎదురుచూపులే మిగులుతున్నాయి. శ్రీవారి దర్శనానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ కేంద్రాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం ఎంవీపీ కేంద్రంగా దశాబ్దాల క్రితం అందుబాటులోకి తెచ్చింది. అయితే ఈ సేవలు కోవిడ్ కారణంగా నిలిచిపోయాయి. కోవిడ్ అనంతరం ఆన్‌లైన్ టికెట్ విక్రయాలను టీటీడీ ప్రారంభించినప్పటికీ ఈ సెంటర్ సేవలను పునరుద్ధరించలేదు. భక్తులకు గతంలో విలువైన సేవలు అందించిన ఈ సెంటర్ కార్యకలాపాల పునఃప్రారంభం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

గతంలో సేవలు ఇలా.. : వెంకన్న దర్శనానికి సంబంధించి టికెట్ విక్రయాలు నెల రోజుల ముందుగానే ఇక్కడ జరిగేవి. టీటీడీ మార్గదర్శకాలకు అనుగుణంగా వారు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నెల రోజులు ముందుగానే ఆయా తేదీల్లో దర్శన టికెట్లను విక్రయించేవారు. దీంతో పాటు తిరుమల కొండపైన, కొండ దిగువన భక్తుల ఆసక్తికి అనుగుణంగా గదులు సైతం బుక్ చేసేవారు. రూ.300, రూ.600 టికెట్ల విక్రయాలు నిత్యం ఇక్కడ జరిగేవి. దీంతో పాటు ఆర్జిత సేవలైన శ్రీవారి కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, వసంతోత్సవం, సహస్ర దీపాలంకరణ, విశేష పూజ టికెట్లు కూడా విక్రయించేవారు. భక్తు లు కేవలం ఆధార్ కార్డు జిరాక్స్‌లు, డబ్బులు చెల్లించి ఆయా సేవలు పొందేవారు. ఇప్పుడు ఈ సేవల న్నీ నిలిచిపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితిల్లో ప్రైవేట్ నెట్ సెంటర్లను ఆశ్రయించి దర్శన టికెట్లను బుక్ చేసుకుంటుండడంతో భక్తులపై ఆర్థిక భారం పడుతోంది.

రెండున్నరేళ్లుగా ఇబ్బందులు

కోవిడ్ కారణంగా రెండున్నరేళ్ల క్రితం నిలిపివేసిన ఎంవీపీ ఈ-దర్శన టికెట్ కౌంటర్‌ను పునరుద్ధరించకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నాం. దర్శన టికెట్ల కోసం పెద్ద ఎత్తున ప్రైవేట్ బుకింగ్ సెంటర్ల చుట్టూ తిరగాల్సి వస్తోంది. అయినా టికెట్లు లభించడం లేదు. సమయానికి టికెట్లు దొరకకపోవడంతో పాటు అదనంగా డబ్బులు వసూళ్లు చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో విడుదల చేసిన గంటల వ్యవధిలోనే దర్శన టికెట్లు అయిపోతున్నాయి. ఈ నేపథ్యంలో టీటీడీ ఉన్నత ఆశయంతో అందుబాటులోకి తెచ్చిన ఎంవీపీ కాలనీ ఆన్‌లైన్ సెంటర్ సేవలను పునరుద్ధరించాలని కోరుతున్నాం.

– పి.గురుమూర్తి, ఎంవీపీ కాలనీ

ఈ-దర్శన టికెట్ కౌంటర్ పునరుద్ధరించాలి

భక్తులకు ఈ-దర్శన టికెట్ కౌంటర్ సేవలు ఎంతో ఉపయుక్తంగా ఉండేవి. దర్శన టికెట్లు ముందుగానే పొందడం ద్వారా రైల్వే, బస్సుల ద్వారా వెళ్లే వారు ప్రయాణ టికెట్లను అనుకున్న తేదీల్లో సులభంగా పొందేవారు. ఆన్‌లైన్ టికెట్లు బుకింగ్‌పై అవగాహన లేని భక్తులకు సైతం ఇక్కడి సిబ్బంది విశిష్ట సేవలు అందించేవారు. దీంతో ఈ సెంటర్‌కు విశేష ఆదరణ లభించింది. ఇప్పటికైనా ఈ కేంద్రాన్ని తిరిగి ప్రారంభించాలని టీటీడీ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నాం.

– సత్యకుమార్, ఎంవీపీ కాలనీ

రాంకీపై చర్యలకు వినతి

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలో గ్రీన్‌బెల్ట్, బఫర్ జోన్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న రాంకీ యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పటాన్‌శెట్టికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఫార్మాసిటిలో రాంకీ యాజమాన్యం చెరువు, కాలువల తవ్వకాలు చేపట్టిందని వాటిని తక్షణమే నిలిపివేయాలని కోరారు. యాజమాన్యం చర్యల వల్ల తానాం, తాడి, బొద్దపువానిపాలెం, గౌతులచ్చన్న కాలనీ, గొర్లివానిపాలెం, పరవాడ గ్రామాల్లో భూగర్భ జలాలు కలుషితమై పర్యావరణం దెబ్బతింటుందని గనిశెట్టి పేర్కొన్నారు.

దేవస్థానం బంకుల్లో చిల్లర సమస్య

సింహాచలం: వినియోగదారులు ఇచ్చే రెండు వేల రూపాయల నోట్లతో సింహాచలం దేవస్థానం పెట్రోల్ బంకుల్లో చిల్లర సమస్య తలెత్తుతోంది. వినియోగదారులు దేవస్థానం బంకుల్లో పెట్రోల్, డీజిల్ కొట్టించుకున్న అనంతరం ఇస్తుండటంతో రూ.2 వేల నోటు ఇవ్వడంతో చిల్లర సమస్య తలెత్తుతోందని దేవస్థానం పెట్రోల్ బంకుల పర్యవేక్షణ అధికారి పద్మనాభరాజు సోమవారం తెలిపారు. ఇక మీదట రూ.1500కు పైగా పెట్రోల్, డీజిల్ కొట్టించుకున్న వారి నుంచే రెండు వేల నోటు తీసుకుంటామని తెలిపారు. చిల్లర సమస్య తలెత్తుతుండడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని, వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

నూతన వేతనాలకు వినతి



ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డితో యువ కార్మికులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు నూతన వేతనాల అమలుకు సహకరించాలని ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షులు జి.సంజీవరెడ్డిని స్టీల్‌ప్లాంట్ యువ కార్మికులు కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని సంజీవరెడ్డి నివాసంలో ఆయనను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. నూతన వేతనాలు అమలు కాక, యువ కార్మికులు పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్టీల్‌ప్లాంట్ గుర్తింపు సంఘం ఈ అంశంలో యాజమాన్యంపై ఒత్తిడి తెస్తే పని జరుగుతుందని సంజీవరెడ్డి సూచించగా స్టీల్‌ప్లాంట్‌లో జరుగుతున్న పరిణామాలను ఆయనకు వివరించారు. త్వరలో ఢిల్లీ వెళ్లి కేంద్ర ఉక్కు మంత్రి, కేంద్ర ఉక్కు కార్యదర్శి, స్టీల్‌ప్లాంట్ సీఎండీతో చర్చించి తన వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చినట్టు వారు తెలిపారు. సంజీవరెడ్డిను కలిసిన వారిలో జెర్రిపోతుల మోహన్‌కుమార్, కోరాడ వెంకటరావు, వి.ఎస్.ఎన్.రాజు, బుదిరెడ్డి అప్పారావు, నీల్తాటి రాజు తదితరులున్నారు.

కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిపించాలి


ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ



830వ రోజు ఉక్కు దీక్షలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: దేశంలో ఉన్న పరిశ్రమలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించకుండా ప్రభుత్వరంగ సంస్థలుగా నడిపేలా కార్మికులు తమ పోరాటాల ద్వారా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిపించాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చ్ వద్ద ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 830వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్ష శిబిరంలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు కూర్చుని, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ కంపెనీలకు తాకట్టు పెడుతూ, విదేశాల నుంచి పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామని కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజల్ని మోసం చేయడం సరికాదన్నారు. కార్మికుల బలిదానాలతో సిద్ధించిన పరిశ్రమలను కాపాడుకుంటే, దేశానికి మేలు చేసినట్లేనన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఉత్తమ క్రీడాకారులకు అవార్డులు



పోటీల్లో పాల్గొన్న చిన్నారులతో అతిథులు

మురళీనగర్: మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్స్ పార్కులో సమ్మర్ క్యాంప్ ముగింపు సందర్భంగా సోమవారం సమ్మర్ స్పీడ్ అండ్ రోల్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఉత్తమ క్రీడాకారులకు మెడల్స్ అందజేశారు. పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు కంచరపాలెం సీఐ ఎస్.విజయ్‌కుమార్, క్రైం సీఐ దుర్గాప్రసాద్, ఎయిర్‌పోర్టు సీఐ బి.ఎం.డీ.ప్రసాద్, కంచరపాలెం ఎస్ఐ దివ్యభారతి, స్పోర్ట్స్ అథారిటీ నుంచి ఎస్‌డీవో సూర్యారావు చిన్నారులకు అవార్డులు అందించారు. పార్కు ఉపాధ్యక్షుడు ఎం.శాంతి భూషణరావు, కార్యదర్శి పొట్లూరి నాగరాజు, ట్రెజరర్ కె.కె.సురేష్, కోచ్ సంతోష్, లలితప్రియ, 200లకు పైగా చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'ఎస్సీ, ఎస్టీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

గాజువాక: భెల్ హెచ్‌పీవీపీ ఎస్సీ, ఎస్టీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ సంస్థ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు యూనిట్ హెడ్ ఎంవీఎస్ఎన్ రాజుకు సోమవారం వినతి పత్రం అందించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొల్లి దేముడు ఆధ్వర్యంలో యూనిట్ హెడ్‌ను కలిసి సమస్యలను వివరించారు. అసోసియేషన్ ఎన్నికలను నిర్వహించాలని కోరారు. డీ గ్రేడ్ అయిన తమ అసోసియేషన్ సభ్యులకు గ్రేడ్ లిఫ్ట్ చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కార్మికులకు ప్రమోషన్లలో ప్రాధాన్యత, క్వార్టర్లను కేటాయించాలని కోరారు. నాయకులు జి.చంద్రశేఖర్, కె.ప్రసాదరావు పాల్గొన్నారు.

మహిళా రెజ్లర్ల పోరాటానికి 'అరుణోదయ' సంఘీభావం

ఏయూ క్యాంపస్: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ ఆల్ ఇండియా రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు, ఉత్తరప్రదేశ్ బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని అరుణోదయ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేసింది. మహిళా రెజ్లర్ల న్యాయమైన పోరాటానికి తమ సంఘీభావం ప్రకటించింది. సోమవారం ఆంధ్రా యూనివర్సిటీ ప్లాటినం గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు సి.నాగరాజు అధ్యక్షత వహించారు. అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్ పలు కీలక తీర్మానాలు ప్రవేశపెట్టారు. మద్యం తయారీని, అమ్మకాలను రద్దు చేయాలని, ప్రజాస్వామికవాదులు, ప్రజా కళాకారులు, రచయితలు, మేధావులు, జర్నలిస్టులపై ప్రభుత్వాలు పెట్టిన తప్పుడు కేసులను ఎత్తివేయాలని తీర్మానించారు. అటవీ సంరక్షణ చట్టం నిబంధనలు-2022ను ఉపసంహరించుకోవాలన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 కోడ్లుగా మార్చిన కేంద్ర ప్రభుత్వం వెంటనే తిరిగి కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అరుణోదయ రాష్ట్ర ఆఫీసు బేరర్లు కాకర్ల అప్పారావు, కె.నిర్మల, ఎస్.జయలక్ష్మి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.అప్పలసూరి, ఏడుకొండలు, చంద్రప్ప, రామమూర్తి, ప్రతాప్, ముక్కారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మిమిక్రీ కూడా కళే



మిమిక్రీలో మెలకువలు నేర్పిస్తున్న గౌరీశంకరరావు

సింహాచలం: మిమిక్రీ కూడా ఒక కళే .. సాధన చేస్తే ఎవరైనా చేయవచ్చని మిమిక్రీ కళాకారుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వి.గౌరీ శంకరరావు తెలిపారు. అడవివరం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞానశిబిరంలో సోమవారం మిమిక్రీ కళపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గౌరీ శంకరరావు పలువురి మాటలను అనుకరించి విద్యార్థుల్లో ఉత్సాహం నింపారు. మిమిక్రీ నేర్చుకునేందుకు సులభమైన మార్గాలను తెలియజేశారు. గ్రంథాలయ రీడర్స్ ఫోరమ్ కమిటీ అధ్యక్షుడు బి.బి.రాజేంద్రప్రసాద్, కార్మికనేత సీహెచ్.ఎస్.ఎన్.రాజు విద్యార్థులకు నీతికథలు చెప్పారు. ధ్యానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎన్.వి.నరసింహం, ఉద్యోగి ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

నీతి కథలతో విజ్ఞానం



విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

సబ్బవరం: నీతి కథలు చదవడం ద్వారా విజ్ఞానాన్ని వృద్ధి చేసుకోవచ్చునని సబ్బవరం శాఖా గ్రంథాలయాధికారి శిరీష అన్నారు. గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం పేపర్ రీడింగ్, నీతి కథలు చదవడం, చెప్పడం నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శిబిరం ముగింపు రోజున ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి శిరీష తెలిపారు. కార్యక్రమంలో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

వసతుల కల్పనకు కృషి



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ వసంత

సింహాచలం: జీవీఎంసీ 97వ వార్డు పరిధి ద్రోణంరాజునగర్‌లో రూ.18లక్షలతో నిర్మాణం చేయనున్న కమ్యూనిటీ హాల్ పనులకు సోమవారం కార్పొరేటర్ శానాపతి వసంత శంకుస్థాపన చేశారు. పనులు త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆమె సూచించారు. వార్డులోని అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో శానాపతి శంకరరావు, కాలనీ కమిటీ సభ్యులు పాల్‌రాజు, కృష్ణమూర్తి, కనకరాజు, మహిళలు పాల్గొన్నారు.

జీవ సమతుల్యత బాధ్యత అందరిది



మట్టి పాత్రలు, పక్షి గూడులను పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

ఏయూ క్యాంపస్: ప్రతి జీవిని కాపాడే బాధ్యత మానవులపై ఉందని సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్ సెంటర్ డైరెక్టర్ పి.ఉష పిలుపునిచ్చారు. ప్రపంచ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా సోమవారం ఏయూ ఆర్ట్స్ కళాశాల వద్ద వైజాగ్ ఎన్‌జీవోస్ ఫోరంతో కలసి జీవ వైవిధ్య పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పిచ్చుకల గూళ్లు, పక్షులకు నీరు పెట్టే పాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉష మాట్లాడుతూ అనేక జాతుల జీవులు అంతరించిపోతున్నాయని వాటిని సంరక్షించాల్సిందేనన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మే 22న అనేక దేశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, మనం కూడా అందులో భాగస్వాములు కావాలని విద్యార్థుల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. బయోడైవర్సిటీ బోర్డ్ రీజనల్ కోఆర్డినేటర్ జానకీరామ్ మాట్లాడుతూ జీవ వైవిధ్య పరిరక్షణ మన బాధ్యత అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అంతరిస్తున్న జీవజాతులను, ప్రస్తుతం ఉన్న జీవజాతులను కూడా కాపాడుకోవాల్సిన బాధ్యత మానవాళిపై ఉందన్నారు. వైజాగ్ ఎన్‌జీవోస్ ఫోరం కార్యదర్శి ప్రజ్ఞాన్ కుమార్ మాట్లాడుతూ జీవవైవిధ్యాన్ని పరిరక్షించడానికి స్వచ్ఛంద సంస్థలు పెద్ద ఎత్తున కృషి చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ టీమ్ ప్రతినిధి జె.వి.రత్నం, సిఫా సంస్థ ప్రతినిధి భాస్కర్‌రావు, సోషల్ వర్కర్ రామ, స్వచ్ఛ ప్రియ సంస్థ ప్రతినిధి అనురాధ, సోషల్ వర్క్, ఆంత్రోపాలజి, హిస్టరీ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రిజిస్ట్రార్‌తో నావికాదళాధికారి భేటీ



రిజిస్ట్రార్‌కు మొక్కను బహూకరిస్తున్న ఎ.పి.సింగ్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సోమవారం వెస్టర్న్ నేవల్ కమాండ్ సీనియర్ అధికారి కమాండర్ ఎ.పి.సింగ్ సందర్శించారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్‌తో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏయూతో అవగాహన ఒప్పందం చేసుకునే అంశాలపై చర్చించారు. డిఫెన్స్ ట్రైనింగ్ సెంటర్ నుంచి క్రెడిట్ బదిలీ ఆధారంగా నావికులకు బీఏ(హెచ్‌ఆర్‌ఎం) డిగ్రీలు అందించడం, పీజీ హెచ్‌ఆర్‌ఎం డిగ్రీలను అందించే దిశగా చర్చించారు. మాజీ సైనికోద్యోగులకు పునరావాస కల్పనకు ఈ డిగ్రీలు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తున్నాయన్నారు. అదే విధంగా లాటరెల్ ఎంట్రీ విధానంలో బీటెక్ కోర్సులు చేసేలా సాధ్యాసాధ్యాలను చర్చించారు. ఏయూతో భారత నావికాదళం అనుబంధం ఎంతో విశిష్టమైనదన్నారు. సైనికోద్యోగుల ఉన్నత విద్య లక్ష్యాలను నెరవేర్చడంలో ఏయూ అందిస్తున్న సహకారాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉజ్వల్ కుమార్ ఘటక్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ హితంగా వర్సిటీ ప్రాంగణం



మొక్క నాటుతున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రాంగణాన్ని పర్యావరణహితంగా మలచాలని వర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సూచించారు. సోమవారం ఉదయం ఏయూ హార్టికల్చర్ విభాగంలో ఔషధ, అలంకరణ, నీడనిచ్చే మొక్కల పెంపకాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం వర్సిటీ అధికారులతో కలసి మొక్కలు నాటారు. వర్షాకాలం ప్రారంభం అయ్యే సమయానికి వర్సిటీలో ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని విస్తృతం చేయాలని సూచించారు. పక్షులకు ఆశ్రయం ఇస్తూ, ఆహ్లాదాన్ని పంచే మొక్కలను పెంచడానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. భవనాలకు సమీపంలో కాకుండా దూరంగా మొక్కలను నాటాలని సూచించారు. అనంతరం వర్సిటీ స్వయంగా అభివృద్ధి చేస్తున్న నర్సరీలోని పలు మొక్కలు, వాటి ప్రత్యేకతను వీసీ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, ప్రిన్సిపాళ్లు ఆచార్య ఎ.నరసింహారావు, వి.విజయలక్ష్మి, టి.శోభశ్రీ, బ్యూటిఫికేషన్ విభాగం గౌరవ సంచాలకులు డాక్టర్ జి.వీర్రాజు, డాక్టర్ జె.ప్రకాశరావు, శ్రీధర్‌బాబు, డాక్టర్ టి.షారోన్‌రాజు, ఎస్.ఎ.డి.పాల్ తదితరులు పాల్గొన్నారు.